నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 28 మే 2025 | KARIMNAGAR

## విద్యుత్ వినియోగదారుల కోసం
# వాట్సాప్ చాట్ బాట్

పెద్దపల్లి, మే27: విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడానికి వాట్సాప్ చాట్ బాట్ ఎంతో ఉపకరిస్తుందని విద్యుత్ శాఖ పెద్దపల్లి ఎస్ఈ కంకటి మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సాప్‌లో 7901628348 నంబర్‌కు 'హాయ్' అని చాట్ చేయగానే 'హాయ్ టీజీఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం' అని వస్తుందని, అందులో ఫిర్యాదు చేస్తే నమోదవుతుందని పేర్కొన్నారు. www .tgnpdcl .com వెబ్ సైట్‌లో వాట్సాప్ ఐకాన్ కనిపిస్తుందని, అది క్లిక్ చేసి చాట్ చేయవచ్చని చెప్పారు.



ఖనీలు పాతిన గుర్రంవానిపల్లె పల్లెప్రకృతి వనం

## గుర్రంవానిపల్లెలో
# పల్లె ప్రకృతివనం కబ్జా

- పునరావాస కాలనీ భూములపై పలువురి కన్ను
- ₹3.77 లక్షలతో అభివృద్ధి చేసిన వనానికి రక్షణ కరువు
- కొంత మంది కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందనే అనుమానాలు
- ఎంపీడీవో నుంచి కలెక్టర్ వరకు రాతపూర్వక ఫిర్యాదులు
- అయినా మోఖాపైకి వెళ్లని అధికారులు
- విచారణ చేపట్టి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు

పల్లె ప్రకృతి వనాలకు రక్షణ లేకుండా పోతున్నదా..? కబ్జా చేసేందుకు కొంత మంది ప్రయత్నాలు చేస్తున్నారా..? ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసి ఏళ్ల తరబడి పంచాయతీ ఆధీనంలో ఉన్న భూములను ఇప్పుడు 'తమవే' అంటున్నారా..? నిగ్గుతేల్చాల్సిన అధికారయంత్రాంగం చోద్యం చూస్తున్నదా..? అంటే అవుననే సమాధానమే వస్తున్నది. వేములవాడ అర్బన్ మండలంలోని గుర్రంవానిపల్లె ప్రకృతివనమే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ₹3.77 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ పల్లె ప్రకృతి వనం 'తమదే' అంటూ కొంత మంది మోఖాపై స్వాధీనం చేసుకుంటున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తున్నది. 'అయ్యా.. మా పల్లె ప్రకృతి వనాన్ని కాపాడండి' అంటూ ఎంపీడీవో నుంచి కలెక్టర్ వరకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేసి నెల రోజులు దాటినా సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. నిగ్గు తేల్చాల్సిన అధికారులు నిద్ర పోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను బహిర్గతం చేయాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

కరీంనగర్ మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మధ్యమానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల్లో గుర్రం వానిపల్లె ఒకటి.. డ్యాం కట్టను ఆనుకొని ఉండడం వల్ల ముందుగా ఈ పల్లెను ఖాళీ చేయించి, వేములవాడ అర్బన్ మండల పరిధిలోని మారుపాక శివారులో వీరికి ఆనాటి ప్రభుత్వం పునరాసం కల్పించింది. సర్వేనంబర్ 360, 361 పరిధిలో ఉన్న 26.03 ఎకరాలను 2009లో పునరావాసం కోసం కేటాయించింది. అందులో దాదాపు 248 ప్లాట్స్ కేటాయింపు చేసింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2018లో రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే కాగా, గుర్రంవానిపల్లె కూడా పంచాయతీగా ఏర్పాటైంది. ఈ పునరావాస గ్రామానికి సంబంధించిన భూమి కొలతలు అన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే భూమి కొలతలు, రికార్డుల అధికారులు సర్వే చేసి హద్దులు పెట్టి ఇచ్చారు. ఆ మేరకు ప్లాట్స్ కేటాయించారు. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటులో భాగంగా గుర్రంవాని పల్లెలోనూ 2019-20లో పంచాయతీ తీర్మానం మేరకు ఎకరానికిపైగా స్థలంలో వనం ఏర్పాటు చేశారు. అందులో దాదాపు ₹3.77 లక్షలతో ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకంతోపాటు సిమెంట్‌రోడ్డు నిర్మించారు. కంచె నిర్మాణానికి డబ్బులు లేకపోవడంతో అప్పట్లో చేపట్టలేదు. పంచాయతీ వాళ్లే దీని నిర్వహణ చూసుకుంటున్నారు. ఇదంతా గ్రామస్తుల కండ్ల ముందే ఏళ్ల తరబడిగా జరుగుతున్నది. కానీ, తాజాగా పరిస్థితులు తారుమారు అవుతున్న తీరు చూసి గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారు.

### ఎంపీడీవో నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు

2019-20 నుంచి పల్లె ప్రకృతి వనంగా ఉన్న స్థలాన్ని ప్రస్తుతం కొంత మంది తమదేనంటూ స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా అందులో ఖనీలు పాతారు. ప్రస్తుతం ఇక్కడ గుంట స్థలం విలువ దాదాపు ₹15 లక్షల వరకు ఉన్నది. కొంచెం అటీటు చూసినా పల్లె ప్రకృతివనం భూమి విలువ దాదాపు ₹5 కోట్లవరకు ఉంటుందని అంచనా. ఇదే శివారులోని 366 సర్వేనంబర్‌లో స్థలాన్ని కొనుగోలు చేసిన ఓ వ్యక్తి.. ఇప్పుడు ప్రకృతి పల్లె వనం స్థలం కూడా తాను కొనుగోలు చేసిన స్థలం పరిధిలోకి వస్తుందని, అందుకే ఆ స్థలం స్వాధీనం చేసుకుంటున్నాని చెప్పడమేకాకుండా అందుకు సంబంధించిన పనులు మొదలు పెట్టారు. దీనికి ఆయన 2025 జనవరిలో డీఐ బాల చందర్‌తో చేయించిన సర్వేను ఆధారంగా చూపుతున్నట్టు తెలుస్తున్నది. ఆ సర్వే ప్రకారం ప్రకృతివనం స్థలం తమకే చెందుతుందని, అందుకే స్వాధీనం చేసకుంటున్నామని ఆయన వాదన. నిజానికి ఈ స్థలం తమ గ్రామానికి చెందిందని గ్రామస్తుల వాదన. 2009లో తమకు పునరావాసం స్థలం కేటాయించి హద్దులు నిర్ణయించడమే కాకుండా.. ఇదే స్థలంలో 2019-20లో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి పంచాయతీ ఆధీనంలో నిర్వహిస్తున్నామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. పంచాయతీ ఆధీనంలో ఉన్న స్థలం ఇప్పుడు ప్రైవేటుపరం ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు.

### ఎన్నో అనుమానాలు?

ఈ స్థలం విషయంలో ఎన్నో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొంత మంది కాంగ్రెస్ నాయకులు వెనకుండి కథ నడిపిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిశితంగా చూస్తే అందులోని అనేక అంశాలు పలు అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. 2009లో భూమి కొలతల శాఖా ఉన్నతాధికారులు ఇచ్చిన సర్వే, మోఖా ఆధారంగా సదరు భూమిలోనే 2019-20లో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇప్పుడు డీఐ బాలచందర్ సర్వే ప్రకారం పల్లె ప్రకృతివనం స్థలం తమ పరిధిలోకి వస్తుందని స్వాధీనం చేసుకునే వ్యక్తులు చెబుతున్నారు. అందులో ఏ అధికారి కొలిచింది నిజమో తేల్చాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపైనే ఉన్నది. అలాగే పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేసి.. ఆ పనులకు ₹3.77 లక్షల పేమెంట్ కూడా జరిగింది. ఇది ప్రైవేటు భూమే అయితే సీసీ రోడ్డు నిర్మించిన సమయంలో గానీ, లేదా మొక్కలు పెడుతున్న సమయంలో గానీ ఎందుకు అభ్యంతరం చెప్పలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, భూమి కొలతల విభాగానికి చెందిన ఉన్నతాధికారి కొలిచిన తర్వాత తిరిగి ఆ భూమిపై ఏమైనా వివాదాలు వస్తే.. ఆ పైస్థాయి అధికారి మాత్రమే కొలువాలి. కానీ, ఇక్కడ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వేములవాడ ఆయన కొలిచారు. ఇలా చూసినా ఇది పూర్తిగా నిబంధనల విరుద్ధంగా జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే పల్లె ప్రకృతి వనాన్ని కాపాడాలంటూ.. గ్రామస్తులు చాలా మంది ఎంపీడీవో మొదలు కలెక్టర్ వరకు ఈ యేడాది ఏప్రిల్ 16, 17 తేదీల్లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు వెళ్లి నెల రోజులు దాటుతున్నా ఏ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీనికి కారణం కొంత మంది హస్తం పార్టీ నాయకుల హస్తం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. కాగా పల్లెప్రకృతి వనం పేరిట అభివృద్ధి చేసిన స్థలాలకే రక్షణ లేకుండా పోతే.. ఇక మిగిలిన ప్రైవేటు స్థలాలకు రక్షణ ఎలా ఉంటుందన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో నిజానిజాలను నిగ్గు తేల్చి పల్లె ప్రకృతి వనంను కాపాడే అంశంపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలన్న డిమాండ్ వస్తున్నది. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి శ్రీవాణిని 'నమస్తే తెలంగాణ' ఫోన్ ద్వారా సంప్రదించగా.. ఈ విషయంలో ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. అలాగే ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

### వెంటనే చర్యలు తీసుకోవాలి

పల్లెప్రకృతి వనాన్ని కాపాడాలని ఎంపీడీవో మొదలు కలెక్టర్ వరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినం. 2009 నుంచి పంచాయతీల స్వాధీనంలో ఉన్న స్థలం ఇప్పుడు ప్రైవేటు ఎలా అవుతుందని ప్రశ్నిస్తే ఏ అధికారి సమాధానం చెప్పడం లేదు. నిజంగానే అది ప్రైవేటు భూమి అయి ఉంటే.. పంచాయతీ నిధుల ద్వారా అభివృద్ధి చేసినప్పుడే అభ్యంతరం తెలుపాలి. కానీ, ఎవరూ చెప్పలేదు. అలాగే ఉన్నతాధికారులు కొలిచిన భూమిలో ఆ స్థాయి కంటే తక్కువ అధికారి ఎలా కొలుస్తారు? కొలిస్తే పంచాయతీకి ముందుగా నోటీసు ఇవ్వాలి. కానీ, సదరు అధికారి ఆ పనిచేయలేదు. మొత్తంగా ఈ భూమి కబ్జాకు గురవుతున్నట్టు మాకు అర్థమవుతున్నది. వెంటనే ఉన్నతాకారులు జోక్యం చేసుకొని.. తమ గ్రామ పంచాయతీ భూమి తమ పంచాయతీకి దక్కేలా చర్యలు తీసుకోవాలి. లేదా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం. అధికారులు స్పందించకపోతే.. న్యాయ పోరాటం చేస్తాం. ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి భూమిని కాపాడాలి.

**- నాగారం బాలరాజు, తాజా మాజీ ఉపసర్పంచ్ (గుర్రంవాని పల్లె)**

## సంక్షేమానికి నై..
# గొడవలకు సై
## కయ్యానికి కాలు దువ్వుతున్న కాంగ్రెస్ నేతలు



సోమవారం సిరిసిల్లలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణిపై లాఠీ చార్జి చేస్తున్న పోలీసులు

- ముఖ్యనేతలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు, ప్రెస్ మీట్‌లు
- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విషయంలో అడుగడుగునా ప్రొటోకాల్ ఉల్లంఘన
- ఇవి చాలవన్నట్టు ఎమ్మెల్యే నివాసంలో సీఎం ఫొటో పెడుతామంటూ రభస

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం, యంత్రాంగం, నాయకులు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరి దుందుడుకు చర్యలు రోజురోజుకూ శృతిమించుతున్నాయి. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నివాసంలో ముఖ్యమంత్రి ఫొటో పెట్టాలంటూ ఆ పార్టీ శ్రేణులు చేసిన రచ్చపై బీఆర్ఎస్ వర్గాలు భగ్గుమంటున్నాయి. ఒకవైపు ప్రొటోకాల్ పాటించకపోయినా సహిస్తున్నామని, కానీ, గిచ్చి కయ్యం పెట్టుకోవాలని చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరిస్తున్నాయి.

కరీంనగర్, మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు కలపై కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ.. ఏడాది కాలంగా ప్రెస్ మీట్లు, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. వెనకబడ్డ సిరిసిల్లను అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను అవమానపరిచేలా అధికారిక కార్యక్రమాల ఫ్లెక్సీల్లో ఫొటో పెట్టకుండా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారు. అక్కడితో ఆగకుండా రెచ్చగొట్టే మాటలు, ప్రసంగాలతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. కార్మిక ధార్మిక క్షేత్రం నిరుద్యోగులకు పదివేల మందికి ఉపాధి కల్పించేలా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ₹165 కోట్లతో ఏర్పాటుచేసిన అప్పారెల్ పార్కులో అంతర్జాతీయ గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుకు కేటీఆర్ కృషి చేశారు. ఆయన కృషితో ఏర్పాటైన టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ కంపెనీని గత నెల 12న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించిన విషయం తెలిసిందే. 2వేల మందికి ఉపాధి కల్పించే ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో కేటీఆర్ ఫొటోలు కూడా ఫ్లెక్సీలో పెట్టకపోవడం ప్రభుత్వ వివక్షతకు కారణమన్న విమర్శలు వచ్చాయి. అలాగే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్‌ల అధికారిక కార్యక్రమంలో సైతం స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటోను ఫ్లెక్సీలో పెట్టకుండా అక్కసు చూపారు. కేటీఆర్ ఫొటోను ఎందుకు పెట్టలేదని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై దాడులు చేసే ఒదుకు యత్నించారు. ఘర్షణకు తావిస్తున్న కాంగ్రెస్ నేతల తీరుపై, వారికి సహకరిస్తున్న కొంత మంది అధికారుల శైలిపై ఇటీవల బీఆర్ఎస్ నేతలు ఎస్పీని కలిసి ఫిర్యాదు కూడా చేశారు. ఇవి చాలవన్నట్టు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడికి యత్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను కార్యాలయంలో పెట్టాలంటూ పోలీసుల ముందే బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డ తీరు.. హస్తం నాయకుల ఆగడాలు ఏ మేరకు శృతిమించుతున్నాయో చెప్పడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వారిని అడ్డుకోవాల్సిన పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం, అధికారయంత్రాగం వత్తాసు పలుకుతున్నదని చెప్పడానికి నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గాయపడిన జిందం చక్రపాణిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగారావు, గూడూరి ప్రవీణ్

# దౌర్జన్యానికి దిగితే సహించం

- కాంగ్రెస్ నేతలు తీరు మార్చుకోవాలి
- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కరీంనగర్, మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు అసహనానికి లోనవుతున్నారని, అందుకే ప్రజలను పక్కదారి పట్టించే కుట్రలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు విమర్శించారు. అధికారంలో ఉన్న మీరు ప్రొటోకాల్ పాటించకపోగా వ్యక్తిగతంగా దాడులకు దిగుతుండడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని హితవు పలికారు. దౌర్జన్యాలకు దిగితే ఇక సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నడుచుకుంటే ప్రజలు స్వాగతిస్తారని, అధికారం ఉందని విర్రవీగితే తప్పకుండా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రేవంత్ చిత్రపటం పెడతామని కాంగ్రెస్ నాయకులు సోమవారం దిగిన నేపథ్యంలో పోలీసులు లాఠీచార్జి చేయగా, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి గాయపడ్డారు. మంగళవారం ఆయనను సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో లక్ష్మీనరసింహారావు పరామర్శించి మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ ఫొటో పెట్టాల్సింది పోయి, కాంగ్రెస్ నాయకులు దీనిని వ్యక్తిగతంగా తీసుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫొటో పెట్టాలంటూ దౌర్జన్యాలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేల నివాస గృహాల్లో ముఖ్యమంత్రి ఫొటో పెట్టాలని ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎక్కడా సర్క్యులర్ లేదా ఆదేశాలు లేవన్నారు. విషయం తెలుసుకోకుండా సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నివాసంలో సీఎం ఫొటో పెట్టాలంటూ గిచ్చి కయ్యం పెట్టారని మండిపడ్డారు. వారిని కట్టడి చేసి తగిన బుద్ధిచెప్పాల్సిన పోలీసులు.. బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహించారు. సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనకపోవడంతో కల్లాల్లోనే వడ్లు మొలకెత్తుతున్నాయని, ఆ విషయాన్ని పట్టించుకోకుండా సీఎం ఫొటో పెట్టాలని రచ్చ చేసి పక్కదారి పట్టించే కుట్రలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఇకనైనా ఇటువంటి తప్పుడు పద్ధతులు మానుకోవాలని, లేదంటే ప్రజలే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకుల సహనాన్ని అలుసుగా తీసుకోవద్దని హితవు పలికారు. అర్థం లేని కార్యక్రమాలు చేస్తే ప్రజల్లో కాంగ్రెస్ నాయకులు చులకనవుతారని సూచించారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. నిధులు తెచ్చి సమస్యలు పరిష్కరిస్తే స్వాగతిస్తామని అంతే తప్ప ప్రొటోకాల్ ఉల్లంఘన, రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తే సహించే ప్రశ్నేలేదన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

# ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయింది

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల


కోరుట్ల, మే 27: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని, అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విమర్శించారు. కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కోరుట్ల మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్, తన చేతగాని పాలనతో అపహాస్యం పాలైందన్నారు. ప్రభుత్వ అరాచక పాలనతో సొంత పార్టీ నాయకులే ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ప్రత్యేక పాలసీతో రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన విషయాన్ని గుర్తుచేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో కాంగ్రెస్ నాయకుల చేష్టలతో తెలంగాణకు మచ్చతెచ్చేలా వ్యవహరించారన్నారు. ఈ సీజన్‌లో మత్స్యకారులకు చేప పిల్లలు మంజూరు చేయలేదని, జనుము, జీలుగ విత్తనాలు, ఎరువులు సరిపడా అందించలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కై అరాచక పాలనకు తెర తీశాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, పార్టీ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మాజీ ఎంపీపీ తోట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మూడేళ్లు ఓపిక పడదాం

మరో మూడేళ్లు ఓపిక పడదాం. వచ్చేది మన ప్రభుత్వమే. పార్టీలో పదవులు అనుభవించి బయటకు వెళ్లిన నాయకులకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుదాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవుల కోసం కీచులాడుకోవద్దు. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తాం. గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేసి విజయాన్ని సొంతం చేసుకుందాం. పార్టీ కోసం అంకితభావంతో పని చేసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది.

**- విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు**

# దంచికొట్టిన వాన



కొడిమ్యాల: గంగారాంతండా రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

- రాజన్న జిల్లాలో కుండపోత
- రెండు గంటల పాటు ఏకదాటిగా వర్షం
- పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

రాజన్న సిరిసిల్ల, మే 27(నమస్తే తెలంగాణ): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వర్షం దంచికొట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కుండపోత పోసింది. సాయంత్రం మూడు గంటల సమయంలో ప్రారంభమైన వాన సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా పడింది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామంలో పిడుగు పడి దాసరి లక్ష్మణ్ (26) అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి, రాజన్న ఆలయ పరిసర రహదారులు, జాతర గ్రౌండ్ రహదారులపై వరద నీరు పొంగి ప్రవహించింది. అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చందుర్తి మండలంలోని గుడిపేట, రుద్రంగి మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో వడ్ల కుప్పల చుట్టూ వరద నీరు చేరింది. వీర్నపల్లి పెద్దవాగు, గర్జనపల్లి మూల వాగు ప్రవాహం పెరిగింది. వట్టివాగు ఉధృతికి గర్జనపల్లి, వన్‌పల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్, నేతన్నచౌక్, వెంకంపేట, సర్దార్ నగర్, ప్రగతి నగర్ వార్డులన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. పాతబస్టాండ్ నుంచి కొత్తచెరువు వరకు రోడ్డు వాగును తలపించింది. వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున పోలీసులు పాతబస్టాండ్ నుంచి సంజీవయ్యనగర్, అనంతనగర్ నుంచి పద్మనగర్, చిన్నబోనాల, రాజీవ్‌నగర్ వెళ్లే రహదారిని మూసి వేశారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో వర్షం దంచికొట్టింది. సూరంపేట నుంచి గంగారాంతాండ వెళ్లే రోడ్డులో వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మల్యాల మండలంలోని తాటిపల్లి గ్రామశివారులోని ఓ ఇంటిపైకప్పుపై పిడుగు పడడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా మంథనిలో దాదాపు గంటన్నరకు పైగా భారీ వర్షం పడడంతో పలు వార్డులు, లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించింది. బస్టాండ్, ఎంఈవో కార్యాలయ ఆవరణలు వరద నీటితో నిండి పోయాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కాసారం గ్రామంలో పెద్ది తిరుపతికి చెందిన బర్రె పిడుగుపడి మృతిచెందింది.



గన్నేరువరం: కూలిన భారీ వృక్షం



చందుర్తి: గుడిపేట కొనుగోలు కేంద్రంలో వరద నీటిలోనే ధాన్యం కుప్పలు



ధర్మారం: పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

# మాజీ సర్పంచ్‌లపై నిర్బంధకాండ

కరీంనగర్, మే 27 (నమస్తే తెలంగాణ) : తమకు రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు చేస్తున్న ప్రయత్నాలపై పోలీసుల నిర్బంధకాండ కొనసాగుతున్నది. తాజాగా, మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో తమ గోడు విన్నవించుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని కూడా ప్రభుత్వం అడ్డుకున్నది. పోలీసులతో ముందస్తు అరెస్టులు చేసి ఎక్కడికక్కడ నిర్బంధించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ఆయా మండలాల్లో పోలీసులు తెల్లవారుజామునే మాజీ సర్పంచ్‌ల ఇళ్లకు వెళ్లి అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిద్ర లేవక ముందే తమ ఇండ్లలోకి వచ్చి అక్రమంగా అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాము ఏమైనా దొంగలమా, దొంగతనాలు చేశామా, తెల్లవారుజామునే బలవంతంగా పోలీసు వాహనాల్లో ఎక్కించుకొని తీసుకురావడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇదేమి ప్రజా పాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్డీఎఫ్ నిధులు విడుదల చేసి గ్రామ పంచాయతీ నిధులు విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి పేర్కొనడం సరికాదన్నారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈజీఎస్‌కు సంబంధించిన బిల్లులు మేజర్ పంచాయతీల్లో రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు రావాల్సి ఉందని చెబుతున్నారు.